క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నూతన సీఐగా సత్యనారయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ సైదిరెడ్డి బదిలీపై వెళ్లడంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసే సత్యానారయణను ఇక్కడ కేటాయించారు. శాంతి భద్రతలను పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

కడ్తాల్: పాడిరైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ముద్విన్, చల్లంపల్లి వెలుగురాళ్ల తండా, మద్దెలకుంట తండాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పశువులకు డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జేవీఓ, వైద్య సిబ్బంది ఉన్నారు.

తలకొండపల్లిలో ఆధార్ అప్‌డేట్ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనిల్

తలకొండపల్లి: ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్ సూచించారు. మండల కేంద్రానికి మంజూరైన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆధార్‌లో పేర్లు మార్చుట, పుట్టిన తేదీ, వేలి ముద్రలు తదితర సేవలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శశికళ, ఎంపీటీసీ హేమరాజు, మాజీ ఉప సర్పంచ్ అనిల్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, జగదీశ్వర్, విఠల్, తిరుపతయ్య, ఆంజనేయులు, ప్రసాద్, శాంతకుమారి, యాదయ్య, శ్రీకాంత్, శ్రీను, గణేశ్, జగన్, సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి మహమ్మాయి దేవీ ఉత్సవాలు ముగిశాయి. శుక్రవారం హుండీని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. రూ.1,44,588 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ప్రణీత్ తెలిపారు. కొబ్బరికాయల ఆక్షన్ ద్వారా రూ.34,000, లడ్డూ, పులిహోర ద్వారా రూ.7వేల ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, నాయకులు నర్సింహ, యాదయ్యతో పాటు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

తలకొండపల్లి: సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని ఏఓ రాజు రైతులకు సూచించారు. ఈ పద్ధతులతో అధిక దిగుబడి పొందవచ్చన్నారు.శుక్రవారం మండల పరిధిలోని అంతారం, వెంకటాపూర్ గ్రామాల్లోని వరి పంటలను ఆయన పరిశీలించారు. వరిలో తెగుళ్ల–సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో అగ్గి తెగుళ్ల సోకే ప్రమాదముందన్నారు. వీటి నివారణకు 0.5 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 ఎంఎల్ ఐసోప్రోతయోలిన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం వెల్జాల్, పడకల్‌లోని ప్రాథమిక సహకార సంఘాల గోదాములోని యూరియా నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసరమగు యూరియాను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏఈఓలు, విజయ్, అనిత, శిరీష, రైతులు.. మహేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ గడువు పెంచాలి

కందుకూరు: ధరణి సమస్యలపై ప్రభుత్వం ప్రకటించిన స్పెషల్ డ్రైవ్ గడువును పెంచాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఒక్క కందుకూరు మండలంలోనే నాలుగు వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవన్నీ కేవలం ఈ నెల 9వ తేదీ వరకు ఎలా పరిష్కరిస్తారని పేర్కొన్నారు. మధ్యలో మూడురోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్‌ను మరికొన్ని రోజులు పొడిగించాలని తెలిపారు. అన్ని దరఖాస్తులు సానుకూలంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

చివరి అవకాశం

- మార్చి 2వ వారంతో ముగియనున్న అక్రమ నల్లా కనెక్షన్ల రెగ్యులరైజేషన్ తుదిగడువు
- పొడిగింపు ఉండదన్న జలమండలి అధికారులు
- పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచన



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల నుంచి అనుమతులు పొంది నల్లా కనెక్షన్ తీసుకుని నీటిని వాడుకుంటున్నప్పటికీ నేటికి జలమండలి నుంచి అధికారికంగా కన్జ్యూమర్ అకౌంట్ నంబర్ (క్యాన్ నెంబర్) పొందలేదా, విజిలెన్స్ తనిఖీలతో కేసుల బారి నుంచి బయటపడా లని ఉందా అయితే జలమండలి శాఖ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకుని రెగ్యులరైజేషన్ చేసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గడువు తర్వాత దరఖాస్తులు తీసుకోం..

నల్లాల రెగ్యులరైజేషన్‌కు మార్చి 2వ వారం చివరి వరకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోమని అన్నారు. వినియోగదారుడి పేరు, చిరునామా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఇంటి నంబర్, ప్లాట్ విస్తీర్ణం, భవనం వివరాలు, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి నీటి కనెక్షన్ పొందిన పత్రాలను పేర్కొంటూ అఫిడవిట్ చేయించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ఆగని అక్రమ నల్లా కనెక్షన్‌లు...

అక్రమంగా మంచినీటి నల్లా కనెక్షన్ పొందినవారిపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ చాలామంది ఇప్పటికీ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. జలమండలిలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమంగా పైప్‌లైన్‌ల నుంచి నల్లా కనెక్షన్లను ఇస్తున్నారనే విమర్శలున్నాయి. వీరికి తోడు కొందరు ప్రజాప్రతినిధులు నల్లా కనెక్షన్ తీసునేందుకు అయ్యే ఖర్చులో సగం డబ్బులు తమకు ఇస్తే అంతా చూసుకుంటామని చెప్పి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి కనెక్షన్లను ఇప్పిస్తున్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఫిబ్రవరి 2022లో నాలుగు అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించడంతో పాటు 44 మందిపై కేసులను నమోదు చేశారు. అదేవిధంగా ఈ ఏడాది జనవరిలో విజిలెన్స్ బృందాల తనిఖీల్లో 18 అక్రమ నల్లా కనెక్షన్లను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇలా తనిఖీలు చేస్తున్నప్పటికీ అక్రమ నల్లా కనెక్షన్లకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే అపవాదు ఉంది. ఉన్నతాధికారులు స్పందించి.. అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకునేవారితో పాటు వారికి సహకరించే అధికారులు, నేతలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

క్యాన్ నంబర్ లేకుండా నీటిని వాడుకుంటున్న వారికి రెగ్యులరైజేషన్‌కు మార్చి రెండో వారం వరకు అవకాశం ఉంది. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. అక్రమంగా నల్లా కనెక్షన్ కలిగి ఉన్నట్లైతే ఐపీసీ సెక్షన్–430 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఫిర్యాదు చేయాలనుకునే వారు టోల్ ఫ్రీ నంబర్ 155313కి ఫోన్ చేయవచ్చు.

– వినయ్‌కుమార్, మేనేజర్, జలమండలి శాఖ, తుర్కయంజాల్

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

యాచారం: సాగర్ రోడ్డుపై యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ కోరారు. సీపీఎం నాయకులతో కలిసి శుక్రవారం బస్టాండ్‌ను సందర్శించిన నర్సింహ ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని, తాగునీటి సరఫరా లేదని అన్నారు. రాత్రిపూట విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. బస్టాండ్‌లో సీసీ రోడ్డు లేకపోవడంతో దుమ్ము, ధూళి ఎగిసిపడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. అలాగే సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతీ ఆర్టీసీ బస్సును యాచారం బస్టాండ్‌లోకి వచ్చిపోయేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు పి.అంజయ్య, చందునాయక్, ఆలంపల్లి జంగయ్య, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించండి

వైద్యాధికారి మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

మాడ్గుల: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఈనెల 3న ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని మాడ్గుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహన్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం పల్స్ పోలియో కార్యక్రమంపై ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. మాడ్గుల మండలంలో మొత్తం 2,250 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామని అందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. అలాగే ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలలో పని చేస్తున్న వారి పిల్లలకు చుక్కల మందు వేయించడానికి మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' ఆస్తులను పరిరక్షించండి

అధికారులను కోరిన మైనార్టీ నేతలు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని జామా మసీదు కమిటీ సభ్యులు కోరారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లలిత, ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం, మున్సిపల్ కమిషనర్ వసంతకు శుక్రవారం జామా మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వినతిపత్రాలు అందించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణంలోని సర్వే నంబర్ 1లో రూ.కోట్ల విలువచేసే రెండు ఎకరాల వక్ఫ్ భూమి ఉందని అన్నారు. ఈ స్థలాన్ని పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో అక్రమ నిర్మాణాలు జరిగిన సమయంలో వక్ఫ్ బోర్డు దృష్టికి తీసుకుపోవడంతో వక్ఫ్ బోర్డు ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వాటిని తొలగించారని అన్నారు. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాన్ని గుర్తించి దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వక్ఫ్ బోర్డు స్థలాలను పరిరక్షించకపోతే మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు గౌస్ మొయినుద్దీన్, ఖాదర్‌ఖాద్రీ, మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్, నాయకులు నూరుద్దీన్, చోటేబేగ్, చాంద్‌పాషా, రజాక్, అబ్దుల్ జబ్బార్, సమద్, నయీం, జలీల్, అలీం, చాంద్, హఫీజ్, మజీద్, జహంగీర్, జానీపాషా తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కడ్తాల్: కృత్రిమ ఇసుకను తయారు చేసి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తయారు చేసి ఆమనగల్లుకు తరలించి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో స్థానిక ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి ట్రాక్టర్‌తో పాటు, ఇసుక డంప్ వద్ద ఉన్నటువంటి జేసీబీ, టిప్పర్ వాహనాన్ని సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

మహేశ్వరం: పౌర సరఫరాల కమిషనర్ డీఎస్. చౌహాన్‌ను రేషన్ డీలర్లు కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీలర్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా తనవంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రంగారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణ, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మండ్లు, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాను, రేషన్ డీలర్లు చంద్రశేఖరరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన

మహేశ్వరం: మండల పరిధిలోని నాగుల్‌దోన తండాల్లో ఆంజనేయస్వామి ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, తమలపాకుల అర్చన, పుష్పలంకరణతో పాటు పలు పూజలు భక్తిశ్రద్ధలతో తండావాసులు నిర్వహించారు. ఆలయం వద్ద తండావాసులు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.రాజునాయక్, ఆలయ, తండాపెద్దలు అంగోత్ గోపాల్‌నాయక్, ఆనంద్ నాయక్, జంప్లానాయక్, గాంసీరామ్‌నాయక్, గోవిందునాయక్, సురేందర్ నాయక్, హేమ్లానాయక్, హన్మంతునాయక్, ప్రభునాయక్, దేవ్‌సింగ్ నాయక్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అభినందనీయం

కాంగ్రెస్ నేతలు అశోక్, రవీందర్ నాయక్



ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లిలో జీరోబిల్లు అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ఉచిత కరెంట్ హామీ అమలు చేయడం అభినందనీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కీలుకత్తి అశోక్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జీరో విద్యుత్ బిల్లులను విద్యుత్ శాఖ అధికారుల నుంచి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం..

ఆమనగల్లు: ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని రాష్ట్ర గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేడిగడ్డ రవీందర్‌నాయక్ అన్నారు. ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 హామీల్లో నాలుగు హామీలను ఇప్పటికే అమలు చేసిందని అన్నారు. మిగతా హామీలను కూడా త్వరలో అమలుచేస్తుందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయన్నారు. మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లురవి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి

కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: ఆరుట్లలోని వేణుగోపాల స్వామి ఆలయ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుట్ల రెవెన్యూ పరిధిలోని 1581, 1582 సర్వే నంబర్లలో 12.12 ఎకరాల భూమి దేవాదయ శాఖ పరిధిలో ఉందన్నారు. కొంతమంది రియల్టర్లు ఈ భూమిని విక్రయించాలని గతంలో ప్రయత్నం చేయగా దేవాదయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెనక్కితగ్గారన్నారు. తాజాగా మరోసారి వారి కన్ను ఆలయ భూములపై పడిందని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆలయ భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, నాయకులు చంద్రయ్య, భాస్కర్, రమాకాంత్‌రెడ్డి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన అవసరం



తలకొండపల్లి: మాక్ పోలింగ్‌లో విద్యార్థులు



మంచాల: మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి

- ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలల్లో మాక్ పోలింగ్

మంచాల: మండల పరిధిలోని జాపాల, ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈకార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బీమ్లా నాయక్, గిరిధర్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలకొండపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..

తలకొండపల్లి: ఓటుహక్కు వినియోగంపై శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటు ఎలా వినియోగించుకోవాలి, అర్హతలు ఏంటి తదితర వివరాలను విద్యార్థులకు ప్రాక్టికల్ రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు.. భగవాన్‌రెడ్డి, విష్ణుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3 వరకు పుల్లారెడ్డినే కొనసాగించండి

- మంచాల పీఏసీఎస్ చైర్మన్ అనర్హత కేసుపై హైకోర్టు స్టే
- వివరాలు వెల్లడించిన పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

మంచాల: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బుస్సు పుల్లారెడ్డిని ఏప్రిల్ 3వ తేదీవరకు కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చింది. అందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డిని ఈ ఏడాది జనవరి 31న అనర్హుడిగా ప్రకటిస్తూ డీసీఓ ధాత్రిదేవి ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఈ ఉత్వర్వులను సవాల్‌చేస్తూ పుల్లారెడ్డి.. హైకోర్టును ఆశ్రయించగా ఏప్రిల్ 3వ తేదీ వరకు పుల్లారెడ్డినే చైర్మన్‌గా కొనసాగించాలని స్టే ఇచ్చింది. శుక్రవారం మంచాలలో పుల్లారెడ్డి మాట్లాడుతూ.. తనపై జనవరి 11వ తేదీన కొందరు కావాలనే తప్పుడు నివేదిక ఇచ్చారన్నారు. దీంతో అదే నెల 29న వివరణ ఇవ్వాలని డీసీఓ, పీఏసీఎస్ చైర్మన్ తనకి నోటీసులు జారీచేశారన్నారు. తన వివరణ కూడా వినకుండా వెంటనే జనవరి 31న తనని అనర్హుడిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఈ విషయమై నేను కోర్టును ఆశ్రయించగా తాజాగా స్టే ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ఎంపీటీసీ సభ్యులు సుకన్య, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, జగన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు.. రఘువతి, జంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, బద్రీనాథ్ గుప్తా, పవన్‌రెడ్డి, అమర్, మహేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతింటున్న వరిపంట

- జింకు లోపమే కారణమంటున్న వ్యవసాయాధికారి
- నివారణ చర్యలు తీసుకోవాలని సూచన



జింకు లోపంతో ఎర్రబారిన వరిపైరు

మంచాల: జింకు లోపంతో గ్రామాల్లో వరిపంట చేలు ఆదిలోనే దెబ్బతింటున్నాయి. తక్షణమే రైతులు నివారణ చర్యలు తీసుకోకపోతే మరింత నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారి జ్యోతి శ్రీ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలో ప్రతి సంవత్సరం యాసంగిలో దాదాపు 7,500 ఎకరాల్లో సాగు చేస్తుంటున్నారు. ఈసారి మాత్రం 4,100 ఎకరాలు మాత్రమే సాగుచేశారు. ఈ యేడాది వేసిన పంటల్లో 40 శాతం మేర నీటి ఎద్దటి కారణంగా ఎండిపోయాయి. మిగిలిన పంటకు 15శాతం పైగా జింకు సల్ఫేట్ లోపం కనిపిస్తోంది. ఇప్పటికే నోములు, జాపాల, లింగంపల్లి, చిత్తాపూర్ గ్రామాల్లో అక్కడక్కడ జింకు లోపంతో వరిపంట చేలు పాడైపోయాయి. ప్రధానంగా జింకు లోపం నివారణ కోసం దుక్కి దున్నే సమయంలో, వరినారు నాటిన తర్వాత కూడా మందులను వాడాలి. చాలామంది రైతులు ఇవేవి పట్టించుకోకపోవడంతో వరి పంటి నాటిన రెండు నెలలో కొత్త పిలికలు రావాల్సిన సమయంలో ఎండుముఖం పట్టి వరిచేను ఎర్రబారుతోంది. దీంతో వరి చేను ఎదుగుదల రాకుండా నష్టం జరుగుతుంది.

జింక్ సల్ఫేట్ పిచారీ చేయాలి

రైతులు వరినారు సమయంలో నిశితంగా పరిశీలిస్తే జింకు లోపం బయట పడుతుందని వ్యవసాయాధికారి జ్యోతి శ్రీ తెలిపారు. వరినారు వేసిన రెండు నెలల్లో పూర్తిగా వరిచేను ఎర్రబారి పోవడం, పిలికలు మొదట్లో ఎండిపోవడం జరుగుతుంది. గమనించి తక్షణమే జింకు లోపం నివారణ కోసం ఎకరాకు 400 గ్రాముల జింకు సల్ఫేట్ పిచికారీ చేయాలి. ఇలా 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు తప్పక పిచికారీ చేయాలి లేదా ముందస్తుగా దుక్కి దున్నే సమయంలోనే ఎకరాకు 20కిలోల జింకు సల్ఫేట్ చల్లాలి. దీంతో వరినారులో కూడా జింకు లోపం రాకుండా ఉంటుంది.

తాగునీటి ఎద్దడి రానివ్వం: డీఎల్‌పీఓ



పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ సాధన

కందుకూరు: ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీఓ సాధన ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో ఎంపీడీఓ సరితతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి నెలాఖరులోగా తప్పనిసరి పన్నులు వంద శాతం వసూలు చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులు, వన నర్సరీల పనుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.